

చివరకు మనిషి

"రైట్" అని కండక్టర్ అరవడంతో పేపరు మిల్లు స్టాప్‌లో ఆగిన ఒకటో నెంబరు సిటీ బస్సు ముందుకు కదిలింది. బస్సులో జనం మధ్య నలిగిపోతున్న కనకయ్య మనసు జనం తగ్గాలనీ, సీట్లో కూర్చోవాలనీ ఆశపడుతోంది.

కనకయ్య వయస్సు నలభై పైనే వుంటాయి. అతను కాతేరు పొగాకు పొలంలో రోజు కూలీ చేస్తున్నాడు. రోజంతా కష్టపడితే యిరవై రూపాయల కూలీ వస్తుంది. ఆ పనైనా సంవత్సరం పొడుగునా వుండదు. పొగాకు కోతలకి వచ్చి బేరన్‌లో కాల్చే వరకే వుంటుంది. ఈ రోజు మొదటి విడతగా కోత ప్రారంభించారు. అందుకే బాగా అలసిపోయాడు కనకయ్య. ఒళ్లంతా పొగాకు జిగురుతో నిండిపోయి చెమట వాసన వేస్తోంది. పొలం పక్కనున్న చెరువు నీటితో ఒళ్లంతా రుద్దుకున్నాడు. అయినా ఒంటికి పట్టిన జిగురూ, చెమట వాసన కూడా పూర్తిగా పోలేదు.

బస్ తుమ్మలావ స్టాప్‌లో ఆగింది.

వెనుక మార్గం నుంచి జనం దిగుతూంటే — ముందు నుంచి ఎక్కుతున్న జనం ఆ ఖాళీని భర్తీ చేస్తున్నారు.

బస్సులో నలిగిపోతున్న కనకయ్య భారంగా నిట్టూర్చాడు — 'ఏడు గంటల బస్సు ఎక్కితే బావుణ్ణేమో' అని మనసులో అనుకుంటూ.

ఇంతలో ఓ అమ్మాయి గబగబా వచ్చి బస్ ఎక్కింది. క్రిక్కిరిసిన జనంతో బస్ కోలాహలంగా వుంది. బస్ కదిలింది.

అందరూ ఆ అమ్మాయినే తేరిపార చూస్తున్నారు.

ఆ అమ్మాయికి మహా వుంటే యిరవై అయిదేళ్లుంటాయి. అవయవాలు పుష్టిగా వుండడంతో కట్టిన షిఫాన్ చీర కొట్టొచ్చినట్టుంది - బాపూ బొమ్మలా. పెదవులకు రాసుకున్న లిప్‌స్టిక్ ఎర్రగా ధగధగలాడుతోంది. చీరకు తగిన మేచింగ్ జాకెట్టులోంచి వస్తున్న ఖరీదైన సెంట్ తాలూకు గుబాళింపు దాదాపు బస్సు ప్రయాణికులందర్నీ తన్మయుల్ని చేస్తూందనే చెప్పాలి.

ముందు నుంచి జనం కుక్కేస్తుంటే కొంచెం పక్కకు జరగడానికి ప్రయత్నిస్తున్నాడు కనకయ్య. కానీ జనం జరగట్లేదు. ఎవర్ని జరగమంటే ఎవరు కోప్పడ్తారో అని మరీ మాట్లాడలేకపోయాడు కనకయ్య.

ఆ పక్కగా నిల్చున్న షిఫాన్ చీర అమ్మాయి సెంట్ వాసన కూడా కనకయ్య చెమటను డామినేట్ చేయలేకపోతోంది.

చెమట వాసనా పొగాకు వాసనా కలగాపులంగా వచ్చి ఆ అమ్మాయి ముక్కుపుటాల్ని అదరగొట్టేస్తోంది.

ఒక్కసారిగా కనకయ్య వంక తేరిపార చూసింది షిఫాన్ చీర అమ్మాయి. వెంటనే అసహ్యంగా చీదరించుకుంటూ బుర్ర తిప్పుకుంది.

బస్ మార్కండేయస్వామి గుడి స్టాప్‌లో ఆగింది.

"హమ్మయ్యా ... స్టాప్ వచ్చేసింది ... పీడ వదిలింది" అంటూ కనకయ్య వంక కొరకర చూస్తూ, బస్ దిగిపోయింది షిఫాన్ చీర అమ్మాయి.

ఆ తర్వాత కోటిపల్లి బస్ స్టాండ్ వచ్చేసింది. కనకయ్య దిగిపోయాడు. బస్ కదిలింది.

మోరంపూడి వెళ్లే ఆర్టీసి బస్ కోసం ఎదురు చూస్తూ పక్కనే వున్న సిమెంట్ బల్లపై కూర్చున్నాడు కనకయ్య.

కోటిపల్లి స్టాండ్ నుంచి అయితే ఆర్టీసి బస్‌లు ఖాళీగా వుంటాయని గోకవరం బస్‌స్టాండ్‌లో దిగకుండా ఇక్కడ దిగాడు కనకయ్య.

బస్ కోసం తదేకంగా చూస్తున్నాడు కనకయ్య.

లాలా చెరువు నుంచి ధవళేశ్వరం వెళ్లే బస్ కోటిపల్లి స్టాండ్‌లో ఆగింది.

జనం దిగుతున్నారు. అందరిలోనూ త్వరగా ఇళ్లు చేరాలనో, మరో చోటికి చేరాలనో ... ఆత్రుత ప్రతిఫలిస్తోంది. ఇంతలో ఓ అమ్మాయి బస్ దిగబోతూంటే - ప్రక్కనుంచి వేగంగా దూసుకొస్తున్న మోటార్ సైకిల్ సడన్ బ్రేక్ వేయడంతో ఆ అమ్మాయికి ఎటు వెళ్లాలో తెలియని తికమకలో పడింది. వెంటనే తప్పుకోబోయి పక్కనే మరమ్మత్తు చేస్తున్న కాల్వ ఇటుకల మీద పడిపోయింది. బస్ కదిలిపోయింది.

ఆ ప్రాంతంలో జన సంచారం అంతగా లేదు. పడిపోయిన అమ్మాయి మెల్లగా లేవడానికి ప్రయత్నిస్తోంది. ఆమెను లెపడానికి ఎవరూ లేరక్కడ. మోటార్ సైకిల్ అతను చిన్న నిట్టూర్పు వదిలి ఎప్పుడో వెళ్లిపోయాడు. కనకయ్య వెంటనే ఆమెను సమీపించాడు. అమ్మాయి లేచింది. పెద్దగా దెబ్బలేమీ తగల్లేదు.

"అమ్మా ... కళ్లు తిరుగుతున్నాయి" అని మూల్గింది మెల్లగా.

కనకయ్య మెల్లగా ఆ అమ్మాయిని తీసుకొచ్చి తను కూర్చున్న బల్లపై కూర్చోబెట్టి, మొఖం మీద నీళ్లు చల్లి, నీళ్లు త్రాగించాడు.

"అమ్మా... కళ్లు తెరు" ఆమె ముఖాన్ని ఆప్యాయంగా ఆమె చీర కొంగుతో తుడుస్తూ అన్నాడు కనకయ్య.

మెల్లగా కళ్లు తెరుస్తూ శ్వాసపీలుస్తోంది ఆ అమ్మాయి.

ఆ అమ్మాయి కళ్లు పూర్తిగా తెరిచింది. ఎదురుగా - తను గంట క్రితం బస్‌లో చీదరించుకున్న మనిషి! ఆశ్చర్యపోయింది ఆ షిఫాన్ చీర అమ్మాయి.

ఇప్పుడు కూడా కనకయ్య దగ్గర్నుంచి చెమట వాసన వస్తోంది. కానీ ఈసారి చీదరించుకోలేదు షిఫాన్ చీర అమ్మాయి.

ఇంతలో మోరంపూడి వెళ్ళే బస్ రావడంతో -

"అమ్మా ... నే వెళ్తన్నా! చీకటడింది. నువ్వు యింటికి జాగ్రత్తగా" మాటలు పూర్తి చేయకుండానే బస్ ఎక్కేశాడు కనకయ్య.

శ్వాస పీల్చుకుంటున్న షిఫాన్ చీర అమ్మాయి —

"ఏవండీ" అంటూ పిలిచింది ఏదో చెప్పాలని.

ఆ మాట బస్ శబ్దంలో కలిసిపోయింది.

— గజరావు వెంకటేశ్వరరావు